క్లుప్తంగా

అమ్మవారి లడ్డూ, నాణేల దండకు వేలం



లడ్డూ, నాణేల దండను దక్కించుకున్న డాక్టర్ రాజా, నానాజీతో ఆలయ కమిటీ ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక కల్వకొలను వీధిలోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్ర మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఆలయం వద్ద జరిగిన అన్న సమారాధనలో వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. దశమి ఉత్సవాల్లో అమ్మవారి వద్ద ఉంచిన లడ్డూకు, అమ్మ మెడలో వేసిన రూ.5 నాణేల దండకు ఆలయం వద్ద వేలం పాట నిర్వహించారు. లడ్డూను పిండి నానాజీ, నాణేల దండను ఎముకల వైద్య నిపుణుడు డాక్టర్ రాజా వేలం పాటలో దక్కించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు యేడిద శ్రీను, బోణం శ్రీను, కల్వకొలను బుజ్జి, బోణం అప్పారావు, కల్వకొలను ఉమ తదితరులు ఆధ్వర్యంలో శరన్నవరాత్ర ఉత్సవాలు జరిగాయి. పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, మాజీ కౌన్సిలర్ దున్నాల దుర్గ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా ధనకాసులమ్మ ప్రథమ వార్షికోత్సవం

ఐ.పోలవరం: మండల పరిధిలోని జి.మూలపాలెంలో వేంచేసి ఉన్న ధనకాసులమ్మ అమ్మవారి ప్రథమ వార్షికోత్సవ పూజలు మంగళవారం ఘనంగా జరిగాయి. కేశనకుర్రుకు చెందిన సోమియాదుల దివాకర్ శర్మ, విలసవిల్లి గ్రామానికి చెందిన రామకృష్ణశర్మల బ్రహ్మత్వంలో చండీ హోమాన్ని నిర్వహించారు. విజయరామరాజు, ప్రియాంక, సత్తిబాబు, నాగలక్ష్మి దంపతులు కర్తలుగా జరిగిన పూజలకు స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

రేపు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

అమలాపురం రూరల్: అమలాపురం ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికులకు అందిస్తున్న సేవలపై గురువారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకూ డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు తమ సూచనలు, సలహాలను 95819 32678 సెల్ నంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల అభివృద్ధిపై వివక్ష

ముమ్మిడివరం: అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల అభివృద్ధిపై రాజకీయ నాయకులు, అధికారులు వివక్ష చూపిస్తున్నారని కొమానపల్లి సర్పంచ్ భర్త కాశి రామకృష్ణ ఆరోపించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు ఆయన వినతి పత్రం అందజేశారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.13.43 కోట్లు మంజూరైతే షెడ్యూల కులాల ప్రాంతాల్లో ఒక్క పనికి కూడా రూ.లక్ష కేటాయించలేదని ఆయన ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ ప్రాంతాలపై వివక్ష చూపిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన



అల్లవరంలో సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అల్లవరం: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రూ.2.22 కోట్ల ఉపాధి హామీ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్లకు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. తొలి విడతగా ఓడలరేవు, బెండమూర్లంక, తుమ్మలపల్లి, మొగళ్లమూరు, గోడిలంక, గోడి, గోడితిప్ప, అల్లవరం గ్రామాల్లో భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేష గిరిరావు, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సర్పంచ్‌లు మల్లాడి మంగాయమ్మ, బర్రే సీతారత్నం, రాయుడు విష్ణు, రుద్రరాజు పవిత్ర, తోట శ్రీదేవి, చిట్టీడి శ్రీదేవి, బొమ్ము బాలవేణి, వడ్డి సుభాషిణి, ఎంపీటీసీ మౌనిక పాల్గొన్నారు.

ఫిట్టర్ ట్రేడులో తరగతులు నిర్వహించాలి

యానాం: యానాం నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐలో ఫిట్టర్ ట్రేడుకు సంబంధించి తరగతులు, శిక్షణ నిర్వహించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సిహెచ్ కృష్ణసుధాకర్‌కు ఆర్ఎల్‌పీ జననాయగం పెరవై స్టేట్ జనరల్ సెక్రటరీ అరదాడి పోషియ్య మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిట్టర్ ట్రేడులో శిక్షణ కోసం జాయిన్ అయిన విద్యార్థులకు సంబంధిత శిక్షణా తరగతులు జరగకపోవడంతో వారంతా ఇంటివద్దనే ఉండిపోతున్నారన్నారు. సమస్యను పరిష్కరించి తరగతులు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అల్పపీడనం.. గుండెల్లో కలవరం

- పూత దశలో వరి పైరు
- భారీ వర్షాలు కురిస్తే దిగుబడిపై ప్రభావం



ముమ్మిడివరంలో ఏపుగా పెరిగిన వరి పంట

ముమ్మిడివరం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు మరో రెండు రోజుల పాటు కోస్తాంధ్రలో భారీవర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అన్నదాతల గుండెల్లో గుబులు పట్టుకుంది. ప్రస్తుతం వరి పైరు పూత దశలో ఉంది. ఈ సమయంలో భారీ వర్షాలు కురిస్తే పంట దెబ్బతింటుందని అన్నదాతలు వాపోతున్నారు.

ఈదురు గాలులతో తీవ్ర నష్టం

ముమ్మిడివరం, అమలాపురం నియోజకవర్గాల్లో 54,000 ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేపట్టారు. ప్రస్తుతం వరి పంట పూతదశలో ఉందని వ్యవసాయ శాఖ సిబ్బంది చెబుతున్నారు. మరో 10 నుంచి 15 రోజుల్లో గింజలు పాలు పోసుకునే దశకు చేరతాయంటున్నారు. ప్రస్తుతం పూత దశలో భారీ వర్షాలు కురిస్తే దిగుబడి తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. దీంట్లో సుమారు 70 శాతానికి పైగా ఎంటీయూ స్వర్ణ రకం వరినే సాగు చేశారు. దిగుబడి బాగుండడం, తెగుళ్లను తట్టుకోవడంతో ఇతర రకాల కంటే మెరుగైన ఫలితాలుంటాయన్న ఆశాభావంతో ఎంటీయూ స్వర్ణపైనే ఆధారపడుతున్నారు. వీటితో పాటు ఎంటీయూ 1318, బీపీటీ 126 రకాలను కూడా పలువురు రైతులు సాగు చేస్తున్నారు. అయితే అత్యధికంగా సాగు చేస్తున్న స్వర్ణ రకం ఓ మోస్తరు వర్షాలకు తట్టుకునే శక్తి ఉన్నా ఈదురు గాలులు వేస్తే మాత్రం వరి కంకులు నేలను వాలిపోయే అవకాశాలు ఎక్కువ. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఒక మోస్తరు వర్షాలతో ఈ అల్పపీడనం దాటిపోతే పర్వాలేదని అలా కాకుంటే మాత్రం భారీ నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందన్న ఆందోళనలో రైతులు ఉన్నారు. మరోవైపు వరి పంట పదే పదే ముంపుబారిన పడుతుండడం సైతం రైతులను ఆవేదనకు గురి చేస్తుంది. మమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన, తాళ్లరేవు మండలాలలో వరి ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఆయా మండలాల్లో పంట పొలాలకు సాగు, మురుగు నీరు పారే కాలువల నిర్వహణ లోపాల కారణంగా ప్రస్తుతం అధ్వాన్న స్థితికి చేరుకున్నాయి. దీంతో సమయానికి సాగునీరు అందకపోవడమే కాకుండా వర్షాలొచ్చినపుడు ముంపు నీరు దిగక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

భారీ వర్షాలతో ఇబ్బందే



ప్రస్తుతం గింజ పాలు పోసుకోవడానికి తగిన విధంగా వరి పైరు ఉంది. ఇప్పుడు ఒక మోస్తరు వర్షాలతో గట్టెక్కితే పర్లేదు కాని భారీ వర్షాలు కురిస్తే దిగుబడి బాగా పడిపోతుంది. పైగా వర్షాలొచ్చినపుడు ముంపునీరు దిగక రైతులందరం చాలా ఇబ్బందులు పడుతున్నాం.

– ఏఎస్‌వీ సుబ్బారావు, రైతు, అయినాపురం

ముంపునీటితో నష్టాలు



తుఫాను వర్షాల సమయంలో ఎగువ నుంచి వచ్చే ముంపు నీరు సక్రమంగా దిగువకు పోయే మార్గాలుంటే రైతులకు భారీ నష్టాలు కలగవు. కాని డ్రైయిన్లు సరిగా లేక ముంపు నీరు రోజుల తరబడి పొలాల్లోనే నిలిచిపోతుంది. ఈ కారణంగా అన్నదాతలకు నష్టాలు తప్పడం లేదు.

– కర్రి సత్యనారాయణ, రైతు, కర్రివానిరేవు

సానుకూల దృక్పథాన్ని అలవరచుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న సైరస్‌కుమార్

యానాం: ఆలోచనాసరళి వ్యక్తి యొక్క జీవితాన్ని ప్రభావితం చేస్తుందని, అందుకే ప్రతిఒక్కరూ సానుకూల ఆలోచనా దృక్పథం అలవర్చుకోవాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు బీపీ సైరస్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్‌రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్ యూనిట్–1, యూనిట్–2ల ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వ్యసనం–శారీరక, మానసిక స్థితిగతులపై వాటి ప్రభావం అనే అంశంపై సదస్సును ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సైరస్‌కుమార్ మాట్లాడుతూ అందరూ ఆత్మగౌరవాన్ని పెంపొందించుకునేలా కృషి చేయాలని తద్వారా యువత సమాజానికి ఆదర్శప్రాయం కావాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ రీజినల్ కోఆర్డినేటర్ కృష్ణసుధాకర్, యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు చెల్లె నరేష్, ఎస్.శ్రీనివాసరావు, అధ్యాపకులు డాక్టర్ ముత్యాలు, చంద్రశేఖర్‌రావు, శాంతరాజు, రమేష్‌కుమార్, దుర్గయ్య, రమేష్ పాల్గొన్నారు.

గడువు తేదీ ముగిసిన మందుల పంపిణీ

- యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది నిర్వాకం
- ఆసుపత్రి వద్ద రోగి బంధువుల ఆందోళన



గడువుతేదీ ముగిసిన సిరప్ బాటిల్‌ను చూపిస్తున్న బాలుడి తండ్రి

యానాం: యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో గడువుతేదీ ముగిసిన సిరప్ మందును బాలుడికి ఇవ్వడంపై సంబంధిత కుటుంబసభ్యులు మంగళవారం ఆందోళన నిర్వహించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక పట్టణ పరిధిలోని వెంకటనగర్‌కు చెందిన కొప్పిశెట్టి సూర్యప్రకాష్, నాగేశ్వరి దంపతులు 18 నెలల వయసున్న తమ కుమారుడు జ్యోత్స్న వెంకటకృష్ణకు అనారోగ్యంగా ఉండటంతో మంగళవారం ఉదయం యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. వైద్యులు పరీక్షించి మందులు, సిరప్ రాయడంతో వాటిని ఫార్మసీ విభాగం నుంచి తీసుకున్నారు. ఇంటికి వెళ్లిన తర్వాత వైద్యులు చెప్పిన విధంగా బాలుడికి సిరప్ వేశారు. అయితే కాసేపటికే బాలుడికి వాంతులు అవ్వడంతో ఆందోళన చెంది సిరప్ బాటిల్‌కు సంబంధించి గడువు తేదీని చూసి అవాక్కయ్యారు. సిరప్ జూన్, 2024తో గడువు ముగిసిపోయినట్లుగా రాసి ఉండడంతో తక్షణం బాలుడిని తీసుకుని యానాం జీజీహెచ్‌కు మళ్లీ వచ్చారు. ఘటనపై వైద్యుల దృష్టికి, ఫార్మసీ విభాగం సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా వారు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ఆందోళనకు దిగారు. అనంతరం జరిగిన ఘటనపై యానాం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు అరదాడి పోషియ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్‌కు నివాళి



బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో అబ్దుల్ కలామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

అమలాపురం రూరల్: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్ జయంతి కార్యక్రమాలు స్థానిక గడియారం స్తంభం సెంటరు, భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల వద్ద మంగళవారం నిర్వహించారు. గడియారం స్తంభం సెంటరులో జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, కోనసీమ ముస్లిం యూత్ అసోసియేషన్ ప్రతినిధి ఎండీ బషీర్ తదితరులు అబ్దుల్ కలామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భట్లపాలెం ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలోని అబ్దుల్ కలామ్ విగ్రహానికి కళాశాల ఏఓ జక్కం కృష్ణారావు, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అబ్దుల్ కలామ్ అందించిన సేవలు, చేసిన పరిశోధనలు తదితర విశేషాలను వివరించి పలువురు వక్తలు కొనియాడారు.

తాళ్లరేవులో అధిక వర్షపాతం నమోదు



తాళ్లరేవు స్టేట్ బ్యాంకు వద్ద మునిగిన రహదారి

తాళ్లరేవు: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో తాళ్లరేవులో సోమవారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. ఎడతెరిపిలేని వర్షం కారణంగా మండలంలోని పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. దీంతో గ్రామీణ ప్రాంతంలోని అనేక రహదారులు చెరువులను తలపించాయి. 24 గంటల వ్యవధిలో మండలంలో జిల్లాలోనే అత్యధికంగా 124 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ పితాని త్రినాథ్ తెలిపారు.

ముంచేసిన వర్షం

ఐ.పోలవరం: అల్పపీడన ప్రభావంతో కురిసిన భారీ వర్షం మండలాన్ని తడిసి ముద్ద చేసింది. గత రెండు రోజులుగా మండల పరిధిలో దఫదఫాలుగా భారీ వర్షం కురిసింది. బుధవారం ఒక్క రోజే ఏకంగా 17.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. వర్షానికి వరి చేలు ముంపుబారిన పడ్డాయి. పలు గ్రామాల్లో రోడ్ల మీద నీరు చేరింది. ఇళ్ల మధ్య కూడా వర్షం నీరు చేరి నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు.



కుండపోత వర్షానికి నీట మునిగిన సీతారామపురం దేవీమహల్ సెంటర్

అలరించిన చిన్నారుల నృత్యం



నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులను సత్కరించిన నిర్వాహకులు



కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శిస్తున్న చిన్నారులు

యానాం: యానాంలో కొలువైన శ్రీలలితాదేవి 50వ శ్రీదేవీ నవరాత్ర మహోత్సవాల ముగింపును పురస్కరించుకుని పడవలరేవు వీధి మత్స్యకార సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నిర్వహించిన చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా నల్లా హైమావతి శిష్య బృందం ఆధ్వర్యంలో స్థానిక 25 మంది నృత్యకళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు గాను మెట్టకూరు ప్రభుత్వ హైస్కూల్ పీఈటీ శేరు విష్ణుమూర్తిని అభినందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మట్టా సుబ్రహ్మణ్యం, చింతలపూడి రాంపండు, జేఏట బేతాళం కుమార్, ఎన్‌వీవీ రామారావు, నల్లా హైమావతి, నృత్యకళాకారులు సువర్ణ, ఉషా, లక్ష్మి, ప్రదీప్తి తదితరులు పాల్గొన్నారు.

డీటీవో శ్రీనివాస్‌కు సత్కారం



డీటీవో శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న జిల్లా ఆటో యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్లు

అమలాపురం టౌన్: ఇటీవల జిల్లా రవాణాశాఖ అధికారి(డీటీవో)గా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌ను ఆంధ్ర ఆటోవాలా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆటో యూనియన్ నాయకులు స్థానిక ఆర్టీవో కార్యాలయం వద్ద మంగళవారం సాయంత్రం ఘనంగా సత్కరించారు. తాను 20 ఏళ్ల కిందట అమలాపురంలో అధికారిగా పనిచేశానని డీటీవో శ్రీనివాస్ అన్నారు. ఆ అనుభవం, అనుబంధంతో ఇక్కడ డీటీవో పనిచేసేందుకు మీరందరి సహకారం కావాలని ఆయన కోరారు. ఆటోలను వేగ నియంత్రణతో నడిపి ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చాలని సూచించారు. ఆటో రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌ల విషయంలో మీరంతా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఆటోవాలాల జిల్లా యూనియన్ అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ సత్కార కార్యక్రమంలో జిల్లాలోని పలు ఆటో యూనియన్ల నాయకులు, వివిధ కార్మిక సంఘాల నాయకులు యల్లమిల్లి వెంకటేశ్వరావు, కామిరెడ్డి చంద్రరావు, రావూరి రాంబాబు, నెల్లి వెంకటేశ్వరరావు, పేరూరు రాంబాబు, పరుచూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ జారీలో నిబంధనలు పాటించాలి

యానాం: నియోజకవర్గ పరిధిలో ఈడబ్ల్యూఎస్(ఆర్థికంగా వెనుకబడిన) సర్టిఫికెట్ జారీలో సంబంధిత రెవెన్యూశాఖ నిబంధనలు పాటించేలే ఆదేశించాలని కోరుతూ ఆర్ఏఓ మునిస్వామికి విదుతలై చిరతలైగల్ కచ్చి పార్టీ యానాం జిల్లా కార్యదర్శి మెల్లం శ్రీనివాసరావు, సబ్బితి శ్రీనివాస్‌లు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతమంది ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ కోసం తమ పేరిట ఉంటున్న ఆస్తులను తమ బంధువుల పేరుపై మార్చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అదేవిధంగా ఈడబ్ల్యూఎస్ ద్వారా ఉద్యోగానికి ఎంపికైనవారు తాము ఉంటున్న రెండతస్తుల బిల్డింగ్‌లో ఒక అంతస్తును కూల్చివేసి, ప్లాట్ మొత్తం విస్తీర్ణాన్ని 1000 చదరపు అడుగుల దిగువకు తగ్గిస్తున్నారన్నారు. పైగా పాత తేదీల్లో వీలునామాలు సృష్టించడం తదితర మోసాలకు పాల్పడుతుండడంతో నిజమైన పేదలకు అన్యాయం జరుగుతుందన్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు విచారణ నిర్వహించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రాంబాబు (ఫైల్)

అమలాపురం టౌన్: పట్టణ సమీపంలోని విశ్వేశ్వరాయ అగ్రహారం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా, అతడి భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. అల్లవరం మండలం గోపాయిలంక రోడ్డుకు చెందిన నిచ్చనకోళ్ల రాంబాబు (60), భార్య రత్నంతో కలిసి మోటారు సైకిల్‌పై వెళుతుండగా వెనుక నుంచి వాహనం ఢీకొంది. ఈ ఘటనలో రాంబాబు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలపాలైన రత్నం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎస్సై నూజివీడు పృథ్వీ కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

సన్నవిల్లి మాజీ సర్పంచ్ మృతి



వీరాస్వామినాయుడు (ఫైల్)

ఉప్పలగుప్తం: మండలంలోని సన్నవిల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గనిసెట్టి వీరాస్వామినాయుడు(75) సోమవారం రాత్రి గుండెపోటుతో మరణించారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, స్థానిక సర్పంచ్ చిక్కం జంగమయ్య, ఎంపీటీసీ సభ్యురాలు వంగా గిరిజా కుమారి మంగళవారం వీరా స్వామినాయుడు కుటుంబాన్ని పరామర్శించి ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. వీరాస్వామినాయుడుకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

27న జూనియర్ ఇంజనీర్ పరీక్ష

యానాం: పబ్లిక్ వర్క్స్ శాఖలో ఖాళీగా ఉన్న జూనియర్ ఇంజనీర్ పోస్టులకు ఈనెల 27న రాత పరీక్ష నిర్వహించనున్నట్లు అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ శాఖ కార్యదర్శి జయశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 27వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ మొదటి పేపర్, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ రెండో పేపర్ పరీక్ష జరుగుతుందన్నారు. త్వరలో హాల్‌టికెట్లు విడుదల చేస్తామని, వాటి కోసం సంబంధిత వెబ్‌సైట్‌ను చూస్తుండాలని కోరారు.

నందీశ్వరునికి అభిషేకం

తాళ్లరేవు: సుంకరపాలెంలో వేంచేసియున్న శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామివారి ఆలయంలో మంగళవారం రాత్రి నందీశ్వరునికి భక్తిశ్రద్ధలతో అభిషేకం నిర్వహించారు. పవిత్ర పౌర్ణమి ముందుగా వచ్చే త్రయోదశినాడు నందీశ్వరునికి అభిషేకం చేయడం ద్వారా సకల శుభాలు కలుగుతాయని ఆలయ అర్చకులు శ్రీకంఠం భీమేశ్వరరావు శర్మ, ప్రసాద్ శర్మ అన్నారు. వారి పర్యవేక్షణలో దంగుడుబియ్యం దుర్గాసత్యసాయి దంపతులచే నందీశ్వర స్వామివారికి ప్రత్యేక అభిషేక చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ దరఖాస్తులకు గడువు పొడిగింపు

యానాం: యానాం నియోజకవర్గ ప్రాంతానికి చెందిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఉపకార వేతనాలను పొందడానికి దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం ఈనెల 28వ తేదీ వరకూ పొడిగించిందని ఆదిద్రావిడశాఖ ఏడీ రేఖాడి కృష్ణమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేషన్ కార్డుదారులకు దీపావళి కానుక

యానాం: దీపావళి కానుకగా నియోజకవర్గ పరిధిలో ఉన్న అన్ని రేషన్‌కార్డుదారులకు సివిల్ సప్లయిస్ శాఖ ద్వారా దీపావళి కానుక అందించనున్నట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఒక్కో రేషన్‌కార్డుకు 10 కేజీల బియ్యం, 2 కేజీల పంచదార ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. దీపావళి కానుకగా ఇచ్చే ఈ సరకులను రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తారని, ఈ మేరకు డైరెక్టర్ ఎస్.సత్యమూర్తి సంబంధిత జీఓ జారీ చేశారన్నారు. నియోజకవర్గంలో 15,915 కార్డుదారులు లబ్ధి పొందనున్నారని తెలిపారు.

ఆలయాల ఆస్తులకు భద్రత కల్పించాలి

యానాం: పుదుచ్చేరివ్యాప్తంగా నాలుగు రీజియన్లలో ఆలయ భూములకు సంబంధించిన ఆస్తులను కాపాడాలని, భవిష్యత్‌లో ఎటువంటి కబ్జాలు, మోసాలు జరగకుండా యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని ఎల్జీ కె.కైలాష్‌నాథన్ మంగళవారం ఆదేశించారు. కారైకల్‌లో కవిల్‌పత్తులోని శ్రీపార్వతీపరమేశ్వర స్వామి ఆలయానికి చెందిన భూములకు నకిలీ పత్రాలను ఉపయోగించి విక్రయించడానికి జరిగిన మోసంపై పోలీసు విచారణలో కారైకల్ కలెక్టర్, ఇద్దరు ఇతర రెవెన్యూ సిబ్బందిని అరెస్ట్ చేసిన నేపథ్యంలో ఆయన ఈ ఆదేశాలిచ్చారు. ఆలయ భూకబ్జాలపై సమగ్ర విచారణ జరపాలని కుంభకోణాలకు పాల్పడిన వ్యక్తులను గుర్తించి ఆ భూములను సర్వేచేసి తిరిగి స్వాధీనం చేసుకోవాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ల్యాండ్ సర్వే, రిజిస్ట్రేషన్, రిలీజియస్ ఎండోమెంట్ శాఖలు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు.

సీసీ రహదారులకు శంకుస్థాపన



చొల్లంగిలో సీసీ రహదారికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు

తాళ్లరేవు: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా తాళ్లరేవు మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లో రూ.3.43 కోట్ల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సుమారు 6 కిలోమీటర్ల మేర సీసీ రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మంగళవారం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో ప్రజలు డ్రైనేజీలు నిర్మించాలని, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని మొరపెట్టుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు టిళ్లపూడి నాగేశ్వరరావు, ఎంపీడీఓ కె.సత్యనారాయణ, నడింపల్లి వినోద్, ధూళిపూడి వెంకటరమణ, కుడుపూడి శివన్నారాయణ, గుత్తుల సాయి తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు



వెంకటరమణ	-	స్వాగ్
శ్రీలలిత	-	జనక అయితే గనక
శేఖర్–1	-	విశ్వం
శేఖర్–2	-	మా నాన్న సూపర్ హీరో
రమా	-	దేవర
వీపీసీ–1	-	వేట్టయాన్
వీపీసీ–2	-	మార్టిన్